క్లుప్తంగా

యూజీడీ సమస్యకు పరిష్కారం



నీలాపువారి వీధిలో యూజీడీ శుభ్రం చేయిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు నీలాపువారి వీధిలో గత కొన్ని రోజులుగా యూజీడీ మ్యాన్ హోల్స్ పొంగి పొర్లుతున్నాయి. దీంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న వార్డు నాయకుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము విషయాన్ని యూజీడీ సిబ్బందికి తెలిపారు. దగ్గరుండి యూజీడీలను శుభ్రపరచటంతో స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

విలీన సభ విజయవంతం కావాలని ర్యాలీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కంచరపాలెం: డిసెంబర్ 28న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ జ్ఞానాపురం జేఎస్ఎస్ యూఆర్ఎం కాలనీలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు సీపీఐ న్యూడెమోక్రసీ ఏరియా కమిటీ అధికార ప్రతినిధి వై.కొండయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విప్లవకారుల ఐక్యతలో భాగంగా రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, ఎస్.వెంకటలక్ష్మి, బి.గీత, ఈ.లక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలు



భక్తి గీతాలు ఆలపిస్తున్న కండిపల్లి బంగారయ్య భజన బృందం సభ్యులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా గురువారం సాయంత్రం కండిపల్లి బంగారయ్య భజన బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ అర్చకుడు గొడవర్తి వీర రాఘవాచార్యులు భజన బృందం సభ్యులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డులో రామలింగేశ్వర రామజోగిపేట సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కల్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణానికి సహాయ సహకారాలందిస్తానని హామీ ఇచ్చారు. పల్లా వేణుగోపాల్, నారాయణ రావు, బోరా రాజు, పల్లా ప్రసాద్, మధు, కంచుబోయిన శ్రీను, నమ్మి సూర్యనారాయణ, శివ, రమేష్, ఒమ్మి రామకృష్ణ, వెంకట అప్పారావు, బొట్ట రాజు, కిలాని రాజు పాల్గొన్నారు.

ఆదాయానికి గండి



బస్టాప్ ఎదురుగా సర్వీసు చేసుకుంటున్న ఆటోవాలాలు

ఈ చర్యలతో సమస్యలకు చెక్

- రహదారిపై ఆటోలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలి
- బస్టాప్‌లు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలి.
- బస్టాపుల్లో దుకాణాలు తొలగించాలి.
- ఫుట్‌పాత్‌లు ఖాళీ చేయించాలి.
- వన్‌టౌన్ నుంచి వచ్చే వాహనాలకు ఇబ్బందులు లేకుండా దుర్గాలమ్మ గుడి జంక్షన్ నుంచి పోలీసు బ్యారెక్స్ వరకు రహదారిపై పార్కింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలి.
- ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రెండు స్టేషన్ల పోలీసుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలి.
- ఆర్టీసీ వ్యవస్థలో మార్పు రావాలి.

ఆర్టీసీ బస్టాపుల్లో ఆటోల తిష్ట

సమయానికి రాని బస్సులు

దుర్గాలమ్మ గుడి వద్ద ప్రయాణికుల ఇక్కట్లు

ఆటో వాలాల ఇష్టారాజ్యం



బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

జగదాంబ: ప్రజా రవాణా వ్యవస్థ ఆదాయానికి ఆటోలు గండి కొడుతున్నాయి. పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లోని ఆర్టీసీ బస్టాప్ వద్ద ఆటోలు నిలిపి బహిరంగంగానే ప్రయాణికులను పిలుస్తూ సర్వీసులు చేసుకుంటున్నారు. దీని వల్ల ఆర్టీసీ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు ట్రాఫిక్ సమస్యకు కూడా కారణమవుతున్నారు.

ఆర్టీసీ అధికారుల కళ్లెదురుగానే..

ఇదంతా తమ కళ్ల ముందే జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు తమకేం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బస్టాప్‌నకు ఎదురుగా ఆటోలు అడ్డదిడ్డంగా పెట్టి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నా ఎలాంటి హెచ్చరికలు చేయకపోవడంతో ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అంతా ఆటోల వలయంగా మారిపోతోంది. ఆటోల రద్దీ కారణంగా బస్టాప్ వద్దకు బస్సులు రాలేకపోతున్నాయి. దీంతో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తాము ఎక్కాల్సిన బస్సులు ఎక్కలేక ఇబ్బంది పడుతున్నారు. ఇదే అదనుగా ఆటోవాలాలు రంగప్రవేశం చేసి చక్కగా బేరాలు కట్టుకుంటున్నారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.

ఏవీ బస్టాప్‌లు..

ప్రయాణికుల కోసం ఆర్టీసీ అధికారులు దుర్గాలమ్మ గుడి జంక్షన్ వద్ద మూడు బస్టాపులు ఏర్పాటు చేశారు. అక్కడే ఒక కంట్రోల్ రూమ్ కూడా నిర్మించారు. కానీ ఆ బస్టాపుల్లో ప్రయాణికులు నిలబడడానికి చోటు లేకుండా దుకాణదారులు ఆక్రమించుకున్నారు. ఇక్కడ బస్టాపులు ఉన్నా ప్రయాణికులకు అందుబాటులో లేకపోవడంతో ఎండా వానకు.. చలికి ప్రయాణికులు ఇబ్బంది పడుతూ ఆరుబయటే రహదారిపై నిలబడాల్సి వస్తుంది. ఇదే ఆటోవాలాలకు అనుకూలంగా మారిపోయింది. కంట్రోల్ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు బస్సు ప్రయాణం శాపంగా మారిపోయింది.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఏదీ?

ఈ ప్రాంతం అంతా నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతుంది. ఈ ప్రాంతం వన్ టౌన్.. టూటౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలోది కావడం వల్ల ఇక్కడ ఎవరూ ట్రాఫిక్ సమస్య గురించి పట్టించుకోవడం లేదు. ఇక్కడ రహదారికి ఒక పక్క ఆటోలు ఉంటే మరోపక్క మార్కెట్‌కు వచ్చే వాహనాలతో కిక్కిరిసిపోయి ఉంటుంది. ఈ కారణంగా పోలీసు బ్యారెక్స్ వరకు ఈ దారి కిటకిటలాడుతుంటుంది. అలాగే ఫుట్‌పాత్‌లపై దుకాణాలతో ఈ జంక్షన్ సమస్యల నిలయంగా మారిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బస్సులు సమయానికి రావు..



బస్సులు సమయానికి రాకపోవడం వల్ల ప్రయాణికులకు ఆటోలే దిక్కు అవుతున్నాయి. బస్సుల్లో ప్రయాణం సురక్షితం అంటున్నారు. కానీ వారి కోసం ఆర్టీసీ ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడంలేదు. బస్సు వచ్చే సమయానికి ఆటోలు ఇంటికే తీసుకెళ్లిపోతున్నాయి. అందుకే ఆటోలను ఆశ్రయిస్తున్నాం. ఆర్టీసీ వ్యవస్థలో మార్పు వచ్చే వరకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు.

– త్రినాథ్, ప్రయాణికుడు, మధురవాడ

నిలబడలేకపోతున్నాం..



బస్టాపుల్లో దుకాణాల వల్ల ఇబ్బంది పడుతున్నాం. ఆరిలోవ వెళ్లాల్సి వచ్చి బస్టాపులో నిల్చుంటే బస్సులు రాక నిలబడి నిలబడి కాళ్లు నొప్పులు పుడుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రయాణికులకు ఏర్పాటు చేసిన బస్టాపులు వారికి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. బస్సులు సమయానికి వస్తే ఈ బాధ ఉండదు. అధికారులు చర్యలు తీసుకుని ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి.

– అరుణ, లక్ష్మి, లత, ప్రయాణికులు, ఆరిలోవ

నేడు విద్యుత్ మోతపై వైఎస్సార్‌సీపీ పోరుబాట



వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలో పోరుబాట నిర్వహించనుంది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి నేతృత్వంలో నియోజకవర్గ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. ముందుగా నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అధికారుల కార్యాలయం వద్ద ప్రజల తరఫున ప్రజలతో కలిసి భారీ ర్యాలీ చేపట్టనున్నారు. అనంతరం కరెంటు చార్జీలు తగ్గించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నారు.

పోరుబాటకు తరలిరండి..

పోరుబాటపై మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలపై వేల కోట్ల భారం మోపుతున్న కూటమి ప్రభుత్వంపై నిరసన గళం వినిపించాలన్నారు. అసలు కరెంటు చార్జీలు పెంచబోమన్న చంద్రబాబు వినియోగదారులే కరెంట్ అమ్మేలా చేస్తామని ప్రగల్భాలు పలికి, అధికారంలోకి వచ్చాక పేదలపై కరెంట్ చార్జీలు మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల తరఫున.. ప్రజల కోసం చేపట్టనున్న పోరుబాటలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఈ సందర్భంగా వాసుపల్లి పిలుపునిచ్చారు.

షిర్డీసాయి దర్బార్‌లో అన్నప్రసాద వితరణ



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు, ట్రస్ట్ సభ్యులు

అల్లిపురం: వివేకానంద కాలనీలో వెలసిన సాయి శ్రీ మేరు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ షిర్డీసాయి దర్బార్‌లో గురువారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ సభ్యుడు పి.శ్రీనివాసశాస్త్రి, ఇతర సభ్యులు ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనతో సేవా కార్యక్రమాల్లో పాల్గొని జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు. అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు 300 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పీఎస్‌వీజీ ప్రసన్న, ఆర్.ఈశ్వరరావు, బీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

సీపీఐ సీనియర్ నేత చలసాని రాఘవేంద్రరావు



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న చలసాని రాఘవేంద్రరావు తదితరులు

అల్లిపురం: వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దామని సీపీఐ సీనియర్ నేత, రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు పిలుపునిచ్చారు. సీపీఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్ల ప్రస్థానంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాట వారసత్వంతో పాటు సామాజిక ప్రగతి కోసం నిరంతరం పోరాటాల్లో ఉన్న కమ్యూనిస్టు శక్తుల చరిత్రను మననం చేసుకుంటూ భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సమాయత్తం కావాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జీఎస్‌జే అత్యుతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, బీసీహెచ్ మసేను, క్షేత్రపాల్, సమితి సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహామహులను అందించిన చరిత్ర ఏవీఎన్ కళాశాలది



కళాశాల స్టూడెంట్ కమిటీకి రూ.25 వేల చెక్కు అందజేస్తున్న పైడి రజని

డాబాగార్డెన్స్: దేశంలో పేరొందిన ప్రతిష్టాత్మక విద్యా సంస్థగా మిసెస్ ఏవీఎన్ కళాశాల నిలుస్తుందని ఆ కళాశాల ఇంగ్లిషు విభాగాధిపతి, శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు పైడి రజని పేర్కొన్నారు. కళాశాల 164వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు వంటి స్వాతంత్య్ర సమర యోధుడిని, వివిధ రంగాల్లో ప్రపంచంలో పేరొందిన గొప్ప వ్యక్తుల్ని అందించిన చరిత్ర ఏవీఎన్ కళాశాలకు ఉందని రజని తెలిపారు. గత ఐదేళ్లుగా శక్తి సంస్థ తరఫున ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థులకు భోజనాల కోసం రూ.25 వేల చెక్కును స్టూడెంట్ ఆర్గనైజేషన్ కమిటీకి ఈ సందర్భంగా పైడి రజని అందజేశారు. పైడి రజనిని కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అభినందించారు.

సైన్స్ ఆధారిత విధానాలతో ధూమపానానికి చెక్

డాబాగార్డెన్స్: సైన్స్ ఆధారిత విధానాలతో భారత దేశం రాబోయే పదేళ్లలో ధూమపానాన్ని తగ్గించగలదని ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ (పీఎంఐ) సీఈవో జాసెక్ ఓల్‌జాక్ తెలిపారు. స్మోక్–ఫ్రీ భవిష్యత్ ప్రయాణాన్ని ఇన్నోవేషన్ టెక్నోవేషన్ వేగవంతం చేస్తోందన్నారు. నగరంలో ఓ హోటల్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ ఇటీవల అబుదాబిలో టెక్నోవేషన్ 10వ ఎడిషన్ నిర్వహించిందన్నారు. సాంప్రదాయ పొగాకుతో పోలిస్తే హానిని తగ్గించడానికి రూపొందించబడిన ప్రత్యామ్నాయాలతో పొగ రహిత భవిష్యత్ అందుబాటులో ఉందని, నో–కంబషన్ టెక్నాలజీ ద్వారా పీఎంఐ ఎగ్జిక్యూటివ్‌లు సూచించారన్నారు. సిగరెట్లకు ప్రత్యామ్నాయాలను నిషేధించడం దారుణమన్నారు. సిగరెట్ల విక్రయం కొనసాగుతుండగా, తక్కువ హానికరమైన ప్రత్యామ్నాయాలను ప్రజలకు అందకుండా చేయడం అనైతికమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిగరెట్ కాల్చడం వల్ల వచ్చే పొగలో హానికరమైన రసాయనాలు, అధిక స్థాయిలో సంబంధిత వ్యాధులకు ప్రధాన కారణం ఎలా ఉన్నాయో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

క్యాజువాలిటీ ఆధునికీకరణ పనులకు శ్రీకారం



క్యాజువాలిటీ అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో క్యాజువాలిటీ ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం పోర్టు ట్రస్టు రూ. కోటి నిధులు మంజూరు చేసింది. దీంతో గురువారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ డీఈఈ మన్మథరావు, కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ పీఎస్ అప్పారావు, చీఫ్ డైటీషియన్ హనుమంతు వెంకట రమణమూర్తి, మేనేజర్ పీఎం జవహర్ లాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు బాబు వెన్నుపోటు

కూటమి సర్కారుపై ధ్వజమెత్తిన కొండా రాజీవ్ గాంధీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్

మహారాణిపేట: సొంత గనులు లేక ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బందుల్లో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎన్నికల ముందు ప్రైవేటీకరణ కాకుండా కాపాడతామని చెప్పిన చంద్రబాబు సర్కార్ అధికారంలోకి వచ్చాక ఊపిరి తీసేస్తూ ద్రోహం చేస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ ధ్వజమెత్తారు. పీఎం మోదీని కలిసి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించమని అడగకుండా ఆర్సెలర్స్ మిట్టల్ స్టీల్స్‌కి గనులు కేటాయించమని చంద్రబాబు అడగడం అన్యాయం అని గురువారం ఆయన మీడియాకు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ని నమ్ముకుని లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా బతుకుతున్నారని, వాళ్ల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలు ఆడుతుందని మండిపడ్డారు. గతంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కి వచ్చి గొప్పలు చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంత అన్యాయం జరుగుతున్నా ఎందుకు నోరు విప్పడం లేదని కొండా ప్రశ్నించారు.

రెడ్‌క్రాస్ సమావేశం వాయిదా

మహారాణిపేట: ఈనెల 29వ తేదీన జరప తలపెట్టిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సర్వ సభ్య సమావేశం వాయిదా పడింది. ముందు అనుకున్న ప్రకారం ఈనెల 29న సర్వ సభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వ సభ్య సమావేశం వాయిదా పడిందని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో తెలియజేస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి పి.రవికుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

కులగణనలో తప్పులుంటే తెలియజేయండి

మహారాణిపేట: అన్ని సచివాలయాల్లో ప్రచురించిన షెడ్యూల్డ్ కులాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాలపై రూపొందిన కులగణన జాబితాల్లో ఏమైనా ఆక్షేపణలు, దిద్దుబాట్లు ఉంటే ఈనెల 31వ తేదీలోగా సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో) దృష్టికి తీసుకు రావాలని మహారాణిపేట తహసీల్దార్ (ఇన్‌చార్జి) జిలానీ తెలిపారు. దీనిపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో) సంయుక్తంగా దర్యాప్తు చేసి నివేదికను తహసీల్దార్‌కు సమర్పిస్తారని గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. సర్వే పూర్తి అయిన తర్వాత జనవరి 10వ తేదీన వార్డు సచివాలయాల్లో షెడ్యూల్డ్ కులాల సర్వే తుది జాబితాను ప్రకటిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రకటనలో తెలిపారు.


ట్యాక్స్ బకాయి చెల్లించాలని వినతి



కార్మికులతో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల ట్యాక్స్ నగదు వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో క్రిమినల్ కేసులు పెడతామని జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. గురువారం జోనల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు ట్యాక్స్ నగదు చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన జెడ్సీ మాట్లాడుతూ గత నెలలోనే జోన్ పరిధిలో పని చేస్తున్న 630 మందికి సంబంధించిన రూ. 36 లక్షల ట్యాక్స్ నగదు రిలీజ్ చేశామన్నారు. అయినప్పటికీ కార్మికులకు ఎందుకు అందలేదని ప్రశ్నించారు. దీనిపై కార్మికులు మాట్లాడుతూ తమకు పూర్తి స్థాయిలో అందలేదని కేవలం రూ. 10 లక్షలు వరకు మాత్రమే అందజేశారని చెప్పారు. వెంటనే జెడ్సీ సంబంధిత పబ్లిక్ హెల్త్ అధికారి, ఏపీవోలు వెంటనే చాంబర్‌కు రావాలని చెప్పారు. అయితే వారిద్దరూ బయట ఉండడంతో వారి పీఏలతో మాట్లాడారు. ఎందుకు డబ్బు చెల్లింపులో నిర్లక్ష్యం జరిగిందని ఆరా తీశారు. లిస్టులన్నీ సక్రమంగా ఉన్నా ఎందుకు డబ్బు పూర్తిగా చెల్లించలేదని, కార్మికులందరి డబ్బు పూర్తిగా చెల్లించి లిస్ట్ పెట్టాలని హెచ్చరించారు.

కనకమహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా చివరి గురువారం కన్యకాపరమేశ్వరిని కనకమహాలక్ష్మి అలంకరణలో తీర్చిదిద్దారు. అమ్మవారి మూల విరాట్‌కు ప్రాతఃకాల ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో కనకమహాలక్ష్మి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. దేవాలయ ఆస్థాన మండపంలో ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మచే 250 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి ప్రీతికరమైన నాణాలతో ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నారాయణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి డీవీ బాలాజీకుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు బాదం నాగవెంకట కమలశ్రీ, కట్టమూరి ప్రసన్న, కడిమిశెట్టి దంతేశ్వరి, గ్రంధి దేవి, పాలూరి స్వర్ణలత, కొల్లూరు విశాల, గ్రంధి ఉష, కందుల గీతా ఆదిలక్ష్మి, పసుమర్తి హైమావతి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మీ పరిధిలో ఎటువంటి వ్యాధులు సంభవించినా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. చినవాల్తేరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. పలు సర్వేల కోసం సిబ్బందితో చర్చించారు. నేషనల్ కమ్యూనికబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీ) 3.0 సర్వే, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అభ ఐడీ మ్యాపింగ్ శత శాతం సాధించాలని సూచించారు. యూపీహెచ్‌సీ పరిధిలో ఏ విధమైన వ్యాధులు సంభవించినా తక్షణమే సంబంధిత వైద్యాధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి తెలియజేయాలన్నారు. రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక, నేషనల్ హెల్త్ మిషన్ డీపీవో శశిభూషణ్, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన సర్వే పూర్తి చేయాలి



సచివాలయ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

మహారాణిపేట: కులగణనపై అన్ని సచివాలయాల పరిధిలో సామాజిక సర్వే పూర్తి చేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు కోరారు. గురువారం సూర్యాబాగ్ జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. షెడ్యూల్ కులాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాలపై సమీక్ష చేసేందుకు, పథకాలు అమలు చేసేందుకు, మెరుగైన పాలసీ రూపకల్పన కోసం నిర్వహించిన కులగణనపై గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సామాజిక సర్వే (సోషల్ ఆడిట్)ను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో సోషల్ ఆడిట్ జరుగుతుందని, ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ కూడా ఉంటుందని అన్నారు. 26 నుంచి 31వ తేదీ వరకు ప్రజల నుంచి లేదా థర్డ్ పార్టీ నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని, అభ్యంతరాల వివరాలను అధికారులు ఆన్‌లైన్ చేయాలని, తదనంతరం డేటా ధ్రువీకరించి జనవరి 10న తుది కులగణన సర్వే డేటా ప్రచురించాలని తెలిపారు. మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.